క్లుప్తంగా

చెరకు సాగులో రైతులు నిమగ్నం



బూర్జలో చెరకు విత్తనం నాటుతున్న రైతులు

సీతానగరం: మండలంలోని రైతులు మట్టి నమూనా చేసి తారెలు వేసిన భూముల్లో వర్షాలు కురవడంతో చెరకు విత్తం వేసే పనుల్లో నిమగ్న మయ్యారు. ఏటా ఇదేసీజన్‌లో వేలాది ఎకరాల్లో చెరకు విత్తనం నాటుతారు, 2023–24 క్రషింగ్‌ సీజన్‌కు అవసరమైన చెరకు ఉత్పత్తి చెయ్యడానికి ఇదే అదును కావడంతో బోరునీరుకు తోడుగా వర్షాలు కురవడం వల్ల బూర్జ, వెంకటాపురం ,బుడ్డిపేట, ఏగోటివలస గ్రామాల్లో చెరకు విత్తనం నాటే పనుల్లో రైతులున్నారు. చెరకు సాగు విషయమై ఏఓ ఎస్‌.అవినాష్‌ వద్ద ప్రస్తావించగా మండలంలో నీటి వనరులున్న గ్రామాల రైతులు రాహదారులు అనుకూలంగా ఉన్న భూముల్లో ఇప్పటి వరకూ 500 ఎకరాల్లో చెరకు విత్తనం వేసినట్లు తెలిపారు.

పది పబ్లిక్‌ పరీక్షలకు 532 మంది విద్యార్థులు

సీతానగరం: ఏప్రిల్‌ 3వ తేదీ నుంచి జరగనున్న పదోతరగతి పబ్లిక్‌ పరీక్షలు మండలంలోని మూడు (సీతానగరం, బూర్జ ఉన్నత పాఠశాలలు, జోగింపేట గిరిజన ప్రతిభా పాఠశాల) కేంద్రాల్లో నిర్వహిస్తామని ఎంఈఓ జి.సూరిదేముడు అన్నారు. ఈ మేరకు బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మూడు పరీక్షా కేంద్రాల్లో ప్రభుత్వ, ప్రైవేట్‌ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొననున్నారని తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి 517 మంది,ప్రైవేట్‌ పాఠశాలలనుంచి 15 మంది విద్యార్థులు మొత్తం 532 మంది పరీక్షలకు హాజరు కానున్నారని తెలియజేశారు. పరీక్షలు ఉదయం 9.30 గంటలనుంచి మధ్యాహ్నం 12.45 గంటలవరకూ నిర్వహిస్తామని తెలిపారు. విద్యార్థులు హాల్‌టికెట్‌లు ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్‌ చేసుకోవచ్చన్నారు.

ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు

పార్వతీపురంటౌన్‌: ఉగాది పండగను పురస్కరించుకుని పన్నులను వడ్డీ లేకుండా ప్రజలు చెల్లించేందుకు వారికి అవగాహన కోసం పురపాలక సంఘంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని మున్సిపల్‌ కమిషనర్‌ రామప్పలనాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పురసేవ, నగరసేవ యాప్‌ల ద్వారా గాని లేదా సీడీఎంఏ అప్‌ జీటీవీ.ఇన్‌ వెబ్‌సైట్‌లో గాని, నేరుగా పన్ను చెల్లించి వడ్డీ రాయితీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

పాలకొండ రూరల్‌: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి సంబంధించి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఐసీడీఎస్‌ పీఓ ఎస్‌.గీత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని టీడీ పారాపురం కేంద్రంలో కార్యకర్త, ఆయా పోస్టులకు సంబంధించి (బీసీ–బీ మహిళలు), నగర పంచాయతీ పరిధిలో పెద్దకాపువీధి కేంద్రంలో ఆయా పోస్టుకు (ఎస్టీ – మహిళ) అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థులు 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, వావాహితలై ఆయా ప్రాంతాల్లో స్థిర నివాసం ఉండాలని, 21 నుంచి 35 ఏళ్ల వయస్సు ఉండాలన్నారు. ఈ నెల 28లోగా పాలకొండ గారమ్మ కాలనీలో గల ఐసీడీఎస్‌(సీడీపీఓ) కార్యాలయంలో అర్హులు తమ దరఖాస్తులను అందించాలని సూచించారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



శ్రీను కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న మిత్ర బృందం

పాలకొండ రూరల్‌: పట్టణంలోని ఎస్‌.కే.రాజపురంలో నివాసముంటున్న సింహాద్రి శ్రీను ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. ఆయన కుటుంబాన్ని మిత్ర బృందం తరపున దిలీప్‌కుమార్‌ బుధవారం రూ.10,500లను ఆ కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో పి.శివప్రసాద్‌, యామల ఈశ్వరరావు, తలే సీతారామరాజు, ఎం.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

యాత్రకు పోటెత్తిన భక్తులు

వీరఘట్టం: ఉగాది పర్వదినం సందర్భంగా మండలంలోని అచ్చెపువలస సమీపంలో ఉన్న గోవిందమ్మ పేరంటాల గుడి వద్ద బుధవారం జరిగిన యాత్రకు భక్తులు పోటెత్తారు. ప్రతీ ఏటా ఉగాది రోజున ఇక్కడ యాత్ర జరగడం ఆనవాయతీగా వస్తోంది. ఈ ఏడాది కూడా యాత్రను యజ్ఞకర్త ఎస్‌.వి.ఎల్‌.ఎన్‌ శర్మయాజీ ఆధ్వర్యంలో నిర్వహించారు.

గ్లాసుల వితరణ

సీతంపేట: జగనన్న గోరుముద్దలో భాగంగా రాగిజావ తాగడానికి వీలుగా స్థానిక ప్రభుత్వోన్నత పాఠశాలలో చదివిన పూర్వపు విద్యార్థి సీమల నిరంజన్‌ 250 స్టీల్‌ గ్లాసులను ఉచితంగా విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం సోన్యా, విద్యా కమిటీ వైస్‌ చైర్మన్‌ సుభాషిణి, ఉపాధ్యాయులు గోవిందనాయుడు, పాణిగ్రాహి పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో శోభకృత్‌కు స్వాగతం

బలిజిపేట: తెలుగు సంవత్సరాది శోభకృత్‌కు ప్రజలంతా ఘనంగా స్వాగతం పలికారు. ఈ మేరకు ఉగాది వేడుకలను బుధవారం సంబరంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బలిజిపేట మండల ప్రజలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. శుభకృత్‌ నామ సంవత్సరంలో ప్రజలు సంతృప్తిగా ఉండాలని, పంటలు సమృద్ధిగా పండాలని, రైతులు, ప్రజలకు మేలు జరగాలని కోరుతూ ఆలయాలలో అర్చకులు భక్తులతో పూజలు చేయించారు. అందులో భాగంగా వెంగాపురం రామాలయంలో అర్చకులు గోపాలకృష్ణ, ఫణికుమార్‌ల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. అనంతరం భక్తులకు ప్రసాదాలు అందజేశారు.

ఆలయాల్లో వేడుకలు..

పార్వతీపురంటౌన్‌: జిల్లా కేంద్రంలోని పలు దేవాలయాల్లో తెలుగువారి పండగ శోభకృత్‌ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ మేరకు ఉదయం 5గంటల నుంచి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన రహదారిలో గల వరసిద్ధి వినాయక ఆలయంలో స్వామివారికి పూజచేసేందుకు భక్తులు బారులుతీరారు. అలాగే బెలగాం శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పార్వతీపురం డీఎస్పీ సుభాష్‌ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఆలయాల్లో నిర్వహించిన పంచాంగ పఠనాన్ని భక్తులంతా శ్రద్ధగా ఆలకించారు.



బలిజిపేట: వెంగాపురం రామాలయంలో భక్తులకు ప్రసాదం అందజేస్తున్న అర్చకుడు ఫణికుమార్‌

వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

సీతానగరం: శోభకృత్‌ నామ సంవత్సరాన్ని పురస్కరించుకుని సువర్ణముఖినది ఒడ్డున వేంచేసిన వేణుగోపాలస్వామి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాసాచార్యులు భక్తులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగాది పర్వదినం సందర్భంగా ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలని, రైతులకు పంటలు కలిసి రావాలని కోరుతూ వేణుగోపాలస్వామి వారికి పూజలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ ఏడాది రైతులకు పంటలు కలిసివస్తాయని భవిష్యవాణి చెప్పారు. కార్యక్రమంలో పలుగ్రామాలకు చెందిన వందలాదిమంది ప్రజలు పాల్గొన్నారు.



సీతానగరం: వేణుగోపాలస్వామికి పూజలు చేస్తున్న అర్చకుడు శ్రీనివాసాచార్యులు



పార్వతీపురంటౌన్‌:వరసిద్ధి వినాయక ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకుడు



పార్వతీపురం టౌన్‌: క్యూలో బారులు తీరిన భక్తులు



పార్వతీపురం టౌన్‌: వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న డీఎస్పీ సుభాష్‌ దంపతులు

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



చిలకలపల్లిలో అయ్యప్ప ఆలయం వద్ద టెంకాయ కొట్టి ట్రాక్టర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. ఈ మేరకు బలిజిపేటలోని రైతు సేవా సంఘానికి మంజూరైన ట్రాక్టర్‌ను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై యంత్ర సేవా పథకంలో యంత్ర పరికరాలను అందిస్తోందని తెలిపారు. రైతు వ్యవసాయం చేసుకునేందుకు వీలుగా అవసరమైన అన్ని రకాల సేవలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఆర్బీకేలను సచివాలయ పరిధిలో ఏర్పాటుచేసి రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, మందులు, యంత్ర పరికరాలను సబ్సిడీపై ప్రభుత్వం అందజేస్తోందని స్పష్టం చేశారు. అందులో భాగంగా బలిజిపేట రైతుభరోసా కేంద్రంద్వారా రూ.6,85,149 విలువైన ట్రాక్టరును 50శాతం సబ్సిడీపై అందించినట్లు చెప్పారు. 50శాతం రైతు చెల్లిస్తే మిగిలింది బ్యాంకు రుణం పొందే అవకాశం ఉందన్నారు. రూ.2లక్షల సబ్సిడీ రైతులకు అందుతుందని తెలిపారు. ఇటువంటి పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎ.రవికుమార్‌, పెరికబలిజ కార్పొరేషన్‌ డైరెక్టర్‌ శ్రీనివాసరావు, బి.సత్యనారాయణ మూర్తి, ఎ.గోపాలరావు, ఎస్‌.భాస్కరరావు, రమణ, తదితరులు పాల్గొన్నారు.

సాయి బాబా ఆలయంలో పూజలు

నియోజకవర్గం ప్రజానీకంతో పాటుగా యావత్‌ తెలుగు ప్రజలందరికీ శోభకృత్‌ నామ సంవత్సర ఉగాది పండగ శుభాకాంక్షలు తెలియజేస్తూ ఈ తెలుగు నూతన సంవత్సరంలో ప్రజలందరూ బాగుండాలని ఎమ్మెల్యే జోగారావు ఆకాంక్షించారు. ఈ మేరకు బధవారం ఆయన నర్సిపురం గ్రామంలోని సాయి బాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బాబా మందిరం చెరువుకట్ట పైన ఉండటం చేత ఆలయానికి ప్రమాదం పొంచి ఉన్నందున కోనేటి వైపు ప్రహరీ గోడ నిర్మాణానికి ఎమ్మెల్యే అలజంగి జోగారావు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌ చెరుకుబిల్లి బంగారమ్మ, వైఎస్సార్‌సీపీ సీనియర్‌ నాయకులు కాపారపు సత్యనారాయణ, వెంపలి గురురాజు, తెర్లి రామస్వామి, పి శేషు, రెడ్డి అప్పలస్వామి, కె.సంజీవి నాయుడు, ఎస్‌.వెంకటరమణ, బి వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కె.బాలకృష్ణ, మున్సిపల్‌ ఫ్లోర్‌లీడర్‌ మంత్రి రవికుమార్‌, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

ప్రతి నీటిబొట్టునూ ఒడిసిపట్టాలి



మాట్లాడుతున్న నీడ్‌ సంస్థ డైరెక్టర్‌ వేణుగోపాలరావు

సాలూరు: ప్రతి నీటిబొట్టునూ ఒడిసి పట్టాలని నీడ్‌ సంస్థ డైరెక్టర్‌ పి.వేణుగోపాలరావు పిలుపునిచ్చారు. పట్టణంలోని వైటీసీ వద్ద ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జీవరాశులందరికీ నీరు మూలాధారమన్నారు. నీటిని వృథా చేయరాదని తెలిపారు. కార్యక్రమంలో వైటీసీ మేనేజర్‌ సాగర్‌, మోహన్‌, జేజీఎం కో ఆర్డినేటర్‌ సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నీరే మూలాధారం..

జీవరాశులకు నీరే మూలాధారమని రూరల్‌ ఎస్సై ప్రయోగమూర్తి అన్నారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా రూరల్‌ స్టేషన్‌ వద్ద ఆయన మాట్లాడుతూ, నీటి కాలుష్యాన్ని తగ్గించాలన్నారు. భవిష్యత్‌ తరాలకు పరిశుభ్రమైన నీటిని అందించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రీన్‌వరల్డ్‌ వ్యవస్థాపకుడు సంతోష్‌కుమార్‌ పాణిగ్రాహి, పోలీస్‌ సిబ్బంది బంగార్రాజు, నారాయణరావు ఉన్నారు.

సస్యరక్షణ అవసరం

పాలకొండ రూరల్‌: ప్రస్తుత సీజన్‌లో మామిడి పంటలు కీలక దశలో ఉన్నాయని ఉద్యానవన శాఖాధికారిణి టి.అమరేశ్వరి అన్నారు. స్థానిక విలేకరులతో బుధవారం మాట్లాడుతూ పూత దశ నుండి కాయ దశకు చేరుకుంటున్న సమయంలో వర్షాలతో నష్టం కలుగుతుందన్నారు. ఈ వర్షాలకు కాయ 100 గ్రాములకుపైగా ఉంటే గట్టిపడి మంచి దిగుబడి వస్తుందన్నారు. చిన్న కాయలు, పూత దశలో ఉంటే అకాల వర్షాలతో నష్టం వాటిల్లే అవకాశాలు ఉన్నాయన్నారు. ఇప్పటికీ పూత దశలో ఉన్న తోటల్లో మచ్చ, మాడు తెగులు ఆశించే ప్రమాదం ఉందన్నారు. దీనిని అధిగమించేందుకు 0.3 మి.లీ ఇమిడాక్లోప్రిడ్‌, ఒక గ్రాము కార్బండిజమ్‌ లేదా ఒక గ్రాము కార్బండిజమ్‌, 25 గ్రాముల మాంకోజెబ్‌ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. చిన్న పిందెలు, పూత ఉన్న తోటల్లో మళ్లీ చిగుర్లు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ క్రమంలో రసంపీల్చు పురుగులు, తేనె, తామర పురుగులతో సమస్యలు ఏర్పడతాయన్నారు. వీటి నివారణకు 0.3 మి.లీ ఇమిడాక్లోప్రిడ్‌, 2మి.లీ పిప్రోనిల్‌ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయటంతో మంచి ఫలితాలు ఉంటాయన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

భామిని: క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు స్నేహభావం పెంపొందుతుందని వైఎస్సార్‌ సీపీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం అన్నారు. బాలేరులో కొత్తకోట నవీన్‌ మెమోరియల్‌ క్రికెట్‌ టోర్నమెంటును ఆయనతో పాటు బత్తిలి ఎస్‌ఐ వై.అమ్మాన్‌రావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతలో ఆరోగ్యం పెంపొందించి ఐకమత్యం పెంచడానికి క్రీడలు సహకరిస్తాయన్నారు. ఎంపీటీసీ, జేసీఎస్‌ మండల కోఆర్డినేటర్‌ కొత్తకోట చంద్రశేఖర్‌ పర్యవేక్షణలో పోటీలు చేపట్టారు. వైఎస్‌ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావు, పార్టీ జిల్లా కార్యదర్శి కొవ్వాడ చిరంజీవులు, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు ఎం.మోహనబాబు, సొసైటీ చైర్మన్‌ గెల్లంకి రమేష్‌, సర్పంచ్‌ జామి ప్రభాకర్‌, మేడిబోయిన చలపతి తదితరులు పాల్గొన్నారు.

పూర్తి కావచ్చిన ఇంటింటి కుళాయి పనులు

- కేఎస్‌ పురంలో పూర్తి కావచ్చిన కుళాయి పనులు

సీతానగరం:

జల్‌జీవన్‌ మిషన్‌ పథకం ద్వారా మండలంలోని కోటసీతారాంపురంలో చేపట్టిన ఇంటింటి కుళాయి పనులు పూర్తి కావచ్చాయని ఆర్‌డబ్ల్యూఎస్‌ ఏఈ ఆర్‌ పవన్‌కుమార్‌ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన గ్రామంలో ఇంటింటికుళాయి పనులను పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఇంటికి కుళాయి పాయింట్‌ ఏర్పాటు చేసినట్లు చెప్పారు, రోడ్డుకు ఇరువైపులా ఉన్న కుళాయిలకు గ్రామ శివారులో ఓవర్‌ హెడ్‌ట్యాంక్‌ నుంచి ప్రధాన పైప్‌లైన్‌కు కనెక్షన్‌ ఇస్తామని తెలిపారు. త్వరలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు చేతుల మీదుగా ఇంటింటి కుళాయిలను ప్రారంభించడానికి సిద్ధం చేశామని తెలియజేశారు. సర్పంచ్‌ యు.జయలక్ష్మి, ఎంపీటీసీ వై అరుణ కుమారి సూచనల మేరకు గ్రామంలోని అన్ని ఇళ్లకూ సమానంగా నీరు పంపిణీ అయ్యేలా కుళాయిలు ఏర్పాటు చేశామన్నారు.



కేఎస్‌ పురంలో రోడ్డుకు ఇరువైపులా నిర్మించిన ఇంటింటి కుళాయిలు

పాలకొండలో వర్షం

పాలకొండ: తుఫాన్‌ కారణంగా గత రెండు రోజులుగా అడపదడపా కురుస్తున్న వర్షం బుధవారం గంట పాటు కురిసింది. ఉదయం నుంచి ఉగాది పూజలకు అనుకూలంగా వాతావరణం నెలకొంది. మధ్యాహ్నం 3 గంటల నుంచి వాతావరణంలో మార్పులు చోటుచేసుకొని ఒక్కసారిగా మేఘాలు కమ్ముకున్నాయి. అనంతరం గంట పాటు వర్షం పడింది.

గుమ్మలక్ష్మీపురం: మండల పరిధిలోని గ్రామాల్లో బుధవారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. పగటి పూటంతా ఆకాశంలో మేఘాలు కమ్ముకొని ఉన్నప్పటికీ సాయంత్రానికి ఈదురు గాలులతో పాటు కుండపోతగా వర్షం కురిసింది. వారం రోజులుగా రోజూ వర్షం కురుస్తుండటంతో జీడి పంటకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని పలువురు రైతులు ఆందోళన చెందుతున్నారు.



గుమ్మలక్ష్మీపురంలో కురుస్తున్న వర్షం

కోదండరామ స్వామికి ప్రత్యేక పూజలు

గరుగుబిల్లి:

శ్రీరామనవమి ఉత్సవాలలో భాగంగా శ్రీకోదండ రామాలయంలో బుధవారం ఉదయం శ్రీరామ సుప్రభాత సేవ, ఆరాధన, మంగళాశాసనం, రత్విక్‌ వరుణ తదితర పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరామ, లక్ష్మ మంత్ర జపములు, శ్రీమద్రామాయణ పారాయణములు నిర్వహించారు. అనంతరం శ్రీ కోదండరామస్వామిని పలువురు భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలను చేశారు. ఈ నెల 30న ఉదయం 9గంటలకు శ్రీసీతారాముల కల్యాణం నిర్వహించనున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సిబ్బంది పర్యవేక్షణ చేశారు. అలాగే భక్తులకు ఉగాది పచ్చడిని, ప్రసాదాలను అందజేశారు.



కోదండ రామాలయంలో కొలువైన సీతారామలక్ష్మణులు

అమ్మవారికే అండ లేదు...



చిన్నపాప - పెద్దపాప కొలువుదీరిన చింతచెట్టు చుట్టూ ఆక్రమణలు

వీరఘట్టం: వీరఘట్టం గ్రామదేవత పైడితల్లి అమ్మవారి ఉత్సవాన్ని ఆరేడేళ్లకొకసారి పట్టణంలో జరుపుతుంటారు. గ్రామానికి ఇలవేల్పుగా ఉన్న చిన్నపాప - పెద్దపాప దేవతామూర్తులు ఇక్కడ ఓ చింతచెట్టు క్రింద కొలువుదీరారు. ఈ అమ్మవారు ఉండే ప్రాంతం నేటికీ అభివృద్ధికి నోచుకోకపోవడంతో కొందరు ఈ పరిసరాలను ఆక్రమించుకున్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌ 30 నుండి మే 10వ తేదీ వరకు గ్రామదేవత ఉత్సవాలను జరిపించేందుకు గ్రామపెద్దలు ముహూర్తం ఖరారు చేశారు. ప్రస్తుతం ఇక్కడ పరిస్థితులను చూస్తే భక్తులకు ఇబ్బందులు తప్పేటట్లు లేవు.

పట్టించుకునే వారేరీ..

ఇటీవల ఇక్కడ కొందరు చేపట్టిన కట్టడాల వల్ల చిన్నపాప – పెద్దపాప గుడికి వెళ్లేదారి కుచించుకుపోయి ఇరుకుగా మారింది. ఈ విషయాన్ని ఇటీవల కొందరు వ్యక్తులు పెద్దలకు చెప్పినా పట్టించుకునే వారు కరువయ్యారు. ఇప్పటికైనా గ్రామ పెద్దలు పంచాయతీ అధికారులు సమన్వయంతో వ్యవహరించి చిన్నపాప పెద్దపాప ఆలయం వద్ద ఉన్న ఆక్రమణలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

పరిశీలిస్తాం..

పట్టణంలోని తూర్పున ఉన్న చిన్నపాప - పెద్ద పాప గుడిని పరిశీలిస్తాం. ఆక్రమణలు ఉంటే తొలగిస్తాం. అమ్మవారి స్థలాన్ని కబ్జా చేయాలని చూస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. అమ్మవారి పండగకు ఇబ్బందులు లేకుండా భక్తులు చిన్నపాప - పెద్దపాపలను దర్శించుకునేందుకు ఏర్పాట్లు చేస్తాం.

– వి.రామచంద్రరరావు, ఈఓ, వీరఘట్టం మేజరు పంచాయతీ

శాశ్వత కమిటీ లేకపోవడమే..

ప్రస్తుతం పైడితల్లి అమ్మవారి ఆలయం ఆలనా, పాలనా యజ్ఞకర్త శర్మయాజీ చూస్తున్నారు. గ్రామ దేవత పండగ సమయంలో సర్పంచ్‌ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పడడం తర్వాత యథావిధిగా కమిటీ విచ్ఛిన్నం అవుతోంది. దీంతో ఆలయ అభివృద్ధి కుంటు పడుతోంది. శాశ్వత కమిటీ ఏర్పాటు చేసి ఉంటే ఆలయ అభివృద్ధి జరిగి ఉండేదని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా పెద్దలు ఈ అంశంపై దృష్టి సారించి శాశ్వత కమిటీ వేయాలని స్థానికులు కోరుతున్నారు.

మహిళలకు వరం స్త్రీనిధి

- మారుతున్న మహిళా సంఘాల రూపురేఖలు
- ఈ ఆర్థిక సంవత్సరంలో ఉమ్మడి జిల్లాలో రూ. 299.96 కోట్ల రుణ లక్ష్యం
- ఆర్థికంగా నిలదొక్కుకుంటున్న మహిళలు

బలిజిపేట:

మహిళలు సమాజంలో బలమైన ఆర్థిక శక్తిగా ఎదుగుతున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో కరోనా సమయంలో ఆర్థిక మార్గాలవైపు దూసుకుపోయారు. ఇప్పుడు కుటుంబానికి పెద్ద దిక్కవుతున్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో కుటీర పరిశ్రమలు, చేతివృత్తులు, దుకాణాలు, పాడి పరిశ్రమలు నిర్వహించుకుంటూ ఆర్థిక ఆదాయ వనరులను పెంచుకుంటూ పొదుపును ప్రోత్సహిస్తూ అడుగులు ముందుకు వేస్తున్నారు. మహిళలు చేస్తున్న పొదుపు ఆధారంగా బ్యాంకులు కూడా వారికి తగువిధంగా రుణాలు అందిస్తున్నాయి. మహిళలను ఆర్థికంగా మరింతగా బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం విజయవాడ కేంద్రంగా రూ.వెయ్యి కోట్లతో స్త్రీనిధి క్రెడిట్‌ కోఆపరేటివ్‌ ఫెడరేషన్‌ లిమిటెడ్‌ బ్యాంకును ఏర్పాటుచేసి గతంలో కంటే అధికంగా రుణాలు ఇచ్చి వారికి చేయూత అందిస్తోంది.



చిలకలపల్లిలో బట్టల షాపు నిర్వహిస్తున్న మంగమ్మ

మహిళల జీవనోపాధి మెరుగుపరిచేందుకే..



స్త్రీనిధి బ్యాంకు ద్వారా మహిళా సంఘాలలో ఉండే ప్రతి మహిళకు రుణం మంజూరుచేయడమే లక్ష్యం. ప్రతి సంవత్సరం కేటాయింపులు పెరుగుతున్నాయి. మహిళల జీవనోపాధి మార్గం పెంచేందుకే ఈ విధంగా రుణాలు మంజూరుచేసి రికవరీలు శతశాతం చేస్తున్నాం.

ఉమామహేశ్వరరావు, స్త్రీనిధి ఏజీఎం, విజయనగరం

2022–23లో ఉమ్మడి జిల్లాలో 299.96కోట్లు స్త్రీనిధి రుణ లక్ష్యం

ఉమ్మడి విజయనగరం జిల్లాలో రూ.199.41కోట్లు స్త్రీ నిధి ద్వారా 39,882మంది మహిళలకు రుణం లక్ష్యం కాగా రూ.193.09కోట్లు 42,231మందికి అందజేశారు. మిగిలిన లక్ష్యాన్ని ఈ నెలాఖరుకు పూర్తి చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

స్త్రీనిధి రుణం ఎలా పొందాలంటే?

స్త్రీనిధి ద్వారా రుణం పొందాలంటే సంఘం సభ్యురాలై ఉండాలి. పొదుపు సక్రమంగా నిర్వహించాలి. ఆన్‌లైన్‌లో నమోదైన సంఘమై ఉండాలి. ఆ సంఘం స్త్రీనిధి బ్యాంకుకు రూ.7,200 డిపాజిట్‌ చేయాలి. సంఘం రికవరీ 98శాతం ఉండాలి. గ్రామసంఘం రికవరీ 90శాతం, మండల సమాఖ్య రికవరీ 75శాతం ఉండాలి. వీరు బ్యాంకుల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదు. ఆన్‌లైన్‌లో రుణం కోసం దరఖాస్తు చేసుకోవాలి. డాక్యుమెంటేషన్‌ గ్రామంలోనే జరుగుతుంది. దీనికి అదనంగా డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదు. ఇన్‌స్రూ కట్టాలి. బీమా సదుపాయం ఉంటుంది.



వెంగాపురంలో జోళ్ల దుకాణం నిర్వహిస్తున్న సరోజిని

రుణాలతో సంబంధం లేదు

స్త్రీనిధి రుణం పొందేవారు బ్యాంకులలో కూడా రుణాలు తీసుకోవచ్చు. అప్పుతీసుకున్న మొత్తంపై 11శాతం వడ్డీ ఉంటుంది.

రుణాలు ఏవిధంగా కేటాయిస్తారంటే:

రుణాలను స్వల్పకాలిక, మైక్రో, టినీలుగా కేటాయిస్తారు. రూ.10వేల వరకు స్వల్పకాలిక రుణం, రూ.50వేల వరకు మైక్రో రుణం, రూ.50వేలకు పైబడి లక్షవ రకు టినీలో రుణాలు మంజూరుచేస్తారు.